సాక్షి తిరుపతి

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడితే స్మగ్లర్లపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. - 8లో



కలంకారీ.. మనసు దోచెనే..

ముక్కంటి దర్శనానికి శ్రీకాళహస్తికి విచ్చేసిన విదేశీయులు కలంకారీ దుస్తులను కొనుగోలు చేశారు. - 8లో



టీచర్లే మూలస్తంభాలు

ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేయాలనే విధానాలను యూటీఎఫ్ ఎండకట్టాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

సంక్రాంతికి ఆర్టీసీ 230 ప్రత్యేక సర్వీసులు



విశ్వనాథం, ఆర్టీసీ డీసీటీఎం

తిరుపతి అర్బన్: వచ్చే సంక్రాంతి పండుగకు ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(డీసీటీఎం) విశ్వనాథం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 డిపోల నుంచి ముఖ్యమైన అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను జనవరి 9 నుంచి 17 వరకు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌లు, అల్ట్రా డీలక్స్‌లు, సూపర్‌లగ్జరీ, ఇంద్ర, అమరావతి తదితర 230 సర్వీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, చెన్నైతోపాటు గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంక్రాంతికి ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచడం లేదని, సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. ఆ మేరకు కండీషన్‌లో ఉండే సర్వీసులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రత్యేక సర్వీసుల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీదారులు మీ సమస్యలను అధికారులకు తెలియజేయడానికి అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కానున్నారు. అలాగే అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరు కావడంతో పాటు సమయపాలన పాటిస్తే బాగుంటుందని అంతా భావిస్తున్నారు. మరోవైపు అర్జీదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 72,411 మంది స్వామివారిని దర్శించుకోగా, 27,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉప విచారణ కార్యాలయం ప్రారంభం

తిరుమల: శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సామాన్య భక్తులు తిరుమలలో సులభంగా వసతి పొందేలా చర్యలు చేపట్టినట్లు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు తెలియజేశారు. ఆదివారం ఆయన తిరుమలలోని గరుడాద్రి నగర్ కాటేజీ వద్ద ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాన్ని అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తిరుమలలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా తిరుమలలోని అన్ని వసతి గదులు, విశ్రాంతి గృహాల వద్ద సర్వే చేసి మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తిరుమలలోని 42 ఉప విచారణ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ గదుల కరెంట్ బుకింగ్‌లో కేంద్రీయ విచారణ కార్యాలయంపై అధిక భారం పడుతుండడంతో గదుల కేటాయింపు ప్రక్రియను వికేంద్రీకరించినట్లు చెప్పారు. ఉప విచారణ కార్యాలయాల వద్ద గదులు పొందడం, ఖాళీ చేయడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు డ్రాగన్ బోట్ రాష్ట్ర జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: ఏపీ కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 9గంటలకు డ్రాగన్ బోట్ (పడవ) రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను తిరుపతి సమీపంలోని రాయలచెరువులో నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్, రాష్ట్ర కెనియింగ్, కయాకింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.బలరామనాయుడు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్త్రీ, పురుషులకు, మిక్స్‌డ్ కేటగిరీలో 200 మీటర్ల డ్రాటన్ బోట్ స్ప్రింట్, 500 మీటర్ల డ్రాగన్ బోట్ స్ప్రింట్, 2 వేల మీటర్ల ఎండూరెన్సు రేసులో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న 13వ డ్రాగన్ బోట్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు ఈ మూడు విభాగాల్లో ప్రతిభ చాటిన వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 95420 34270 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నాదమే వేదమని!

నేటి ఆధునిక యుగంలో ఒత్తిడి, మానసిక ప్రశాంతత కోసం ఉద్యోగులు, గృహిణులు వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈవెనింగ్ కోర్సులకు క్యూ కడుతున్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు 600 మందికి పైగా ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. వయోలిన్, ఫ్లూట్, వోకల్, భరతనాట్యం, కూచిపూడి, హరికథ, తబలా, మృదంగం, వీణ, నాదస్వరం, డోలు వంటి విభాగాలలో పార్ట్‌టైమ్ కోర్సుల్లో చేరి శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకుంటున్నారు. వారి ఆసక్తి, అభిరుచిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– తిరుపతి సిటీ



సంగీతం కోసం పార్ట్‌టైమ్ కోర్సుల్లో చేరుతున్న ఉద్యోగులు

వయోబేధాలు మరిచి వీణ, వయోలిన్, మృదంగం, ఫ్లూట్, వోకల్‌వైపు మొగ్గు

ఎస్వీయూ మ్యూజిక్ కళాశాలకు క్యూ కడుతున్న గృహిణులు

సంగీతం అంటే ప్రాణం



నేను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్‌లో ఏఈగా పనిచేస్తున్నాను. సంగీతం అంటే ప్రాణం. చిన్నప్పటి నుంచి కళారంగంలో రాణించాలనే కోరిక ఉండేది. ప్రధానంగా 'వోకల్ ' నేర్చుకోవాలనే తపన ఉండేది. విద్యార్థి దశలో అది కుదరలేదు. ప్రస్తుతం 59 ఏళ్ల వయసులో ఈ అవకాశం దొరికింది. ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో ఈవినింగ్ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉండడంతో గత రెండేళ్లుగా వోకల్ నేర్చుకుంటున్నాను. కుటుంబ బాధ్యతలు ఉన్నా నా అభిరుచిని నెరవేర్చుకోవాలనే పట్టుదలదో ప్రతి రోజూ తరగతులకు హాజరవుతన్నాను. సంగీతం నేర్చుకోవడం వల్ల ఒత్తిడి, మానసి కరుగ్మతలు దరిచేరవు. భక్తిభావంతో పాటు క్రమశిక్షణ అలవడుతుంది.

–టీ.కనక సత్యసాయికుమార్, ఏఈ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, తిరుపతి

పీహెచ్‌డీ పూర్తి చేశా



ముత్తూట్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసేదాన్ని. మానసిక ఉల్లాసం కోసం శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలని మ్యూజిక్ కళాశాలలో పార్ట్‌టైమ్ వోకల్ కోర్సులో చేరాను. తర్వాత యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసి ఎస్వీయూలో ఫైనార్ట్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాను. ఉద్యోగాన్ని మానేసి సంగీతమే ప్రపంచంగా జీవిస్తున్నా. ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ పదిమందికీ విద్యాబుద్ధులు నేర్పుతున్నా.

–డాక్టర్ శ్రీలక్ష్మి, తిరుపతి

మృదంగం అంటే ప్రాణం



నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. తబలా, మృదంగంలో ఏదో ఒక వాయిద్యంపై పట్టు సాధించాలనే కోరిక ఉండేది. మృదంగం అంటే ప్రాణం. గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం సాధించిన తర్వాత మ్యూజిక్ కళాశాలలో ఈ విద్యను నేర్చుకుంటున్నా. ఇప్పటికే రెండేళ్ల పాటు శిక్షణ పొందాను. మరో రెండేళ్లు పూర్తయితే సర్టిఫికెట్ కోర్సు ముగుస్తుంది. ఇది తెలియని సంతోషం, మానసిక ఉల్లాసం, నాడీ వ్యవస్థకు మెడిటేషన్‌లా ఉంటోంది.

–పీ.మురుగారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, తిరుపతి

వీణా వాయిద్యంపై మక్కువతోనే



నేను స్విమ్స్ ఆస్పత్రిలో హెడ్ నర్స్ పనిచేస్తున్నాను. శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలనేది చిన్ననాటి కల. ప్రస్తుతం కుటుంబంతో పాటు ఉద్యోగ బాధ్యతలతో బిజీగా జీవితం గుడుస్తోంది. మా పిల్లలు ఇదే మ్యూజిక్ కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సులో చేరారు. వారితో పాటు నేను వీణా వాయిద్యంలో సర్టిఫికెట్ కోర్సులో చేరాను. నాలుగేళ్లుగా నేర్చుకుంటున్నా.

–మునిలక్ష్మి, హెడ్‌నర్స్, స్విమ్స్ ఆస్పత్రి, తిరుపతి

దివ్యౌషధం



సంగీతం మానసిక ప్రశాంతతకు దివ్యౌషధం. నేను గృహిణిని. మా ఫాదర్ సివిల్ ఇంజినీర్. నాన్న ఇదే కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సులో సంగీతం నేర్చుకున్నారు. నన్ను కూడా ఇక్కడే చేర్పించారు. భర్త సహకారంతో ఈవెనింగ్ ఫ్లూట్ వాయిద్యాన్ని నేర్చుకుంటున్నా. పిల్లన గ్రోవి శబ్ద సౌందర్యంతో మనుస్సు ఉల్లాసంగా ఉంటోంది.

–అరుణకుమారి, గృహిణి, తిరుపతి

వయోలిన్ అంటే పిచ్చి



నేను ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాలలో లెక్చరర్. చిన్నతనం నుంచి వయోలిన్ అంటే నాకు పిచ్చి. ఉద్యోగంలో చేరిన వెంటనే మ్యూజిక్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులో అడ్మిషన్ పొందాను. 70 ఏళ్ల వయస్సు పైబడిన వారు సైతం కళాశాలలో సంగీతం నేర్చుకోవడం మాలాంటి వారికి ప్రేరణ కలిగిస్తోంది. వయోలిన్‌లో మంచి ప్రావీణ్యం సాధించాలని కృషి చేస్తున్నా.

–కే.లిఖిత, లెక్చరర్, తిరుపతి

30న కక్ష్యపైకి స్వేచ్ఛశాట్ ఉపగ్రహం



స్వేచ్ఛశాట్ రూపకర్త కె.సాయిదివ్య

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 30న ప్రయోగించనున్న పీఎస్ఎల్వీ సీ60లో భాగంగా పీఎస్–4 ఆర్బిటల్ ఎక్స్‌పరమెంటల్ మాడ్యూల్‌లో స్వేచ్ఛశాట్ అనే ఓ బుల్లి ఉపగ్రహాన్ని పంపనున్నారు. ఈ ప్రయోగంలో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ భాగస్వామ్యం కానుంది. రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొత్తమాను సాయిదివ్య ఎన్ స్పేస్ టెక్ వ్యవస్థాపకురాలిగా ఈ బుల్లి ఉపగ్రహాన్ని తయారు చేసుకుని ఇస్రో సహకారంతో ప్రయోగించనుంది. తమ ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం ఫలించినట్టేనని ఆమె చెబుతోంది. స్వేచ్ఛశాట్ విజయవంతమైతే వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.



పీఎస్-4 ఆర్బిటల్ ఎక్స్‌పరమెంటల్ మాడ్యూల్‌లో పంపిస్తున్న బుల్లి ఉపగ్రహం స్వేచ్ఛశాట్

ఓపెన్ వర్సిటీ అడ్మిషన్లకు అనుమతి ఇవ్వండి



ప్రభుత్వానికి విన్నవిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిలిపివేసిన యూజీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు వచ్చే ఏడాది నుంచి అనుమతులు ఇవ్వాలని విద్యార్థులు, అధ్యాపకులు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ స్టడీ సెంటర్ వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ఏడాదిగా అడ్మిషన్లు నిలిపివేశారన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా ఉన్న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలమంది పీజీ, యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం అన్ని మౌళిక సదుపాయాలు ఉన్న సెంటర్లలో జనవరి నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి ప్రవేశాలు ఆశిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

- విశ్రాంత ఉద్యోగులకు తపాలాశాఖ బాసట
- జీవన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లోనే ఖజానాశాఖకు పంపేలా నిర్ణయం
- జిల్లాలో 30 వేల మందికి ఊరట

తిరుపతి సిటీ: విశ్రాంత ఉద్యోగులు తాము జీవించి ఉన్నామనే ధ్రువీకరణ పత్రాన్ని ఏటా నవంబర్, డిసెంబర్‌లో ఖజానా శాఖకు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం తపాలాశాఖ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విశ్రాంత ఉద్యోగులకు ఇంటివద్దనే డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసేందుకు జీవన్ ప్రమాన్ పేరుతో సరికొత్త పథకానికి నడుం బిగించింది. ఈ మేరకు తిరుపతి జోన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసింది.

డిజిటల్ సేవలు ఇలా...

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాన్ పత్రం) అవసరమైన విశ్రాంత ఉద్యోగులు తమ పరిధిలోని తపాలా సిబ్బందికి సమాచారం అందించాలి. సమాచారం అందుకున్న సదరు సిబ్బంది బ్రాంచ్ పోస్టాఫీసు అధికారుల ఆదేశాలతో డివైజ్‌ల ద్వారా సంబంధిత రిటైర్డ్ ఉద్యోగి ఇంటివద్దకు చేరుకుంటారు. ఆధార్ బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించి, వివరాలను నమోదు చేస్తారు. నమోదు ప్రక్రియ పూర్తైన సెకనులోనే విశ్రాంత ఉద్యోగి మొబైల్ నంబర్‌కు ధ్రువపత్ర ప్రక్రియ పూర్తయినట్లు మెసేజ్ వస్తుంది. దీంతో తపాలా సిబ్బంది సర్టిఫికెట్‌ను అక్కడికక్కడే అందజేసి, ఖజానా కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపుతారు.



తపాలాశాఖ ప్రవేశపెట్టిన నూతన జీవన్ ప్రమాన్ పథకం

కావలసిన పత్రాలు

విశ్రాంత ఉద్యోగి పింఛన్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, పింఛన్ చెల్లింపు పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఉపయోగంలో ఉన్న ఫోన్ నంబర్, ఖజానా కార్యాలయం అడ్రస్ తప్పక ఉండాలి. దీంతో పాటు సేవల ఫీజు రూ.70 చెల్లించాల్సి ఉంటుంది.

30 వేల మందికి ఊరట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఈపీఎఫ్ ద్వారా పింఛన్ పొందుతున్న వారి కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను తపాలాశాఖ అందుబాటులోకి తెచ్చింది. ధ్రువీకరణ పత్రం పొందడమే కాకుండా ఆన్‌లైన్‌లో ఖజానా కార్యాలయానికి చేరుతుంది. దీంతో విశ్రాంత ఉద్యోగులు కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరమే ఉండదు. తిరుపతి జిల్లావ్యాప్తంగా ఖజానా కార్యాలయాల పరిధిలో ఉన్న సుమారు 30వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఊరట కలిగించే అంశం.


సద్వినియోగం చేసుకోండి



విశ్రాంత ఉద్యోగులు ఏటా సమర్పించాల్సి జీవన ధ్రువపత్రాన్ని తపాలా శాఖ ఇంటివద్దనే అందిస్తోంది. వయోభారంతో వ్యయప్రయాసల కోర్చి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. తపాలా శాఖ రిటైర్డ్ ఉద్యోగుల కోసం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. డిజిటల్ సర్టిఫికెట్ అవసరమైన వారు తమ పరిధిలోని పోస్ట్‌మాన్‌కు సమాచారం అందిస్తే చాలు. వారు సంబంధిత సిబ్బందికి చేరవేసి ప్రక్రియను పూర్తి చేసి ఇంటివద్దనే ధ్రువపత్రాలను అందజేస్తారు.

– బి.నరసప్ప, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తిరుపతి


ఆదర్శ తిరుమలే లక్ష్యం



మాట్లాడుతున్న ఈఓ శ్యామలరావు

తిరుమల: తిరుమల క్షేత్రాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తిరుమల విజన్–2047 లక్ష్యమని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్‌డీడీబీ విరాళంగా ఇచ్చిన రూ.70 లక్షల పరికరాలతో టీటీడీ సొంతంగా కల్తీ పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుమలలో సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్యూలైన్లను అదనపు ఈఓ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. 45 అతిథి గృహాలకు వారి సొంత పేర్లను తొలగించి, ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. తిరుమల విజన్–2047 కోసం ప్రతిపాదనలు ఆహ్వానించినట్లు తెలిపారు. తిరుమలను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని, సుమారు 18 ప్రాజెక్టులకు ప్రణాళికలు చేసేందుకు 9 నివేదికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు.

● అవినీతి 'వెలుగులు'



అమ్మకానికి సిద్ధంగా పూజా సామగ్రి



అర్ధరాత్రి భక్తులతో దీపాలు పెట్టిస్తున్న వ్యాపారులు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. రాహు–కేతు పూజల కోసం వచ్చిన భక్తులను టార్గెట్‌గా చేసుకుని అర్ధరాత్రి నిద్రలేపి మరీ దీపాలు వెలిగిస్తున్నారు. అందుకు ఒక్కో భక్తుడి నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. 4 నెలల క్రితం వ్యాపారులు శివయ్య గోపురం వద్ద షెడ్లలో నిద్రపోయే భక్తులను అర్ధరాత్రి తర్వాత లేపి స్నానం చేయకుండా దీపాలు పెడితే దోషాలు పోతాయని నమ్మించి దీపాలు, పసుపు దారాలను అంటగట్టారు.

క్లుప్తంగా

అష్టలక్ష్మి పూజల్లో కేంద్రమంత్రి



పూర్ణాహుతిలో పాల్గొన్న కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం బ్రహ్మర్షి ఆశ్రమంలో జరుగుతున్న అష్టలక్ష్మి ఉత్సవాల్లో ఆదివారం కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ఆశ్రమంలో వెలసిన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురువానంద గురూజీ ఆశీస్సులు పొందారు. ఆశ్రమ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీల్లో ఉద్యోగాల భర్తీ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే వివాహితైన వారు మాత్రమే అర్హులన్నారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 17 అంగన్‌వాడీ కార్యకర్తలు, 11 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 73 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటించారు. ఆ మేరకు సోమవారం నుంచి వచ్చే నెల జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టు కేంద్రాల్లో ఖాళీల వివరాలతోపాటు రిజర్వేషన్ల వివరాలను నోటీస్ బోర్డులో ప్రచురిస్తారని చెప్పారు. 21 ఏళ్లు నిండిన వివాహితులు 35 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. అయితే 21 ఏళ్లు నిండిన వారు లేకుంటే 18 ఏళ్లు నిండిన వారు ఉన్నా, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించింటే వారు అర్హులుగా పిలుస్తామన్నారు. అయితే 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు లేకుంటే దిగువ తరగతులు 9 లేదా 8వ తరగతి వారు అర్హులుగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన పోస్టులను వారి పరిధిలో ఉన్నవారికే అర్హతను బట్టి కేటాయిస్తామని చెప్పారు. ఓ కమిటీ నేతృత్వంలో అర్హత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని నియమిస్తామన్నారు. వివరాల కోసం మీ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులను సంప్రదించాలని కోరారు.

సాక్షి స్పెల్‌బీ పరీక్షకు మూడు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు





సాక్షి స్పెల్‌బీకి అపూర్వ స్పందన

- మూడు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు
- ఆంగ్లంలో రాణించేందుకు స్పెల్‌బీ సరైన వేదిక
- థ్యాంక్స్ టు సాక్షి అంటున్న విద్యార్థులు

నాలుగు కేటగిరీల్లో సాక్షి స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్ష

కేటగిరి – 1	1, 2వ తరగతులు
కేటగిరి – 2	3, 4వ తరగతులు
కేటగిరి – 3	5, 6, 7వ తరగతులు
కేటగిరి – 4	8, 9, 10వ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడం తప్పనిసరిగా మారింది. ఉన్నత విద్య అయినా.. ఉన్నత కొలువులైనా పొందాలంటే ఆంగ్లంలో ప్రావీణ్యం తప్పనిసరి. ఆంగ్ల భాషపై పట్టు, నైపుణ్యం, సామర్థ్యం.. ఒడిసి పట్టుకుంటేనే నేటి తరం విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారు. దీనిని గుర్తించే ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి.. వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తూ.. వారిలో దాగున్న ప్రతిభకు పదును పెడుతోంది. ఇందులో భాగంగానే పాఠశాల స్థాయి, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహిస్తోంది. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫి, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తోంది. ఏటా సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకుంటున్నారు.

సెమీఫైనల్‌కు మూడు జిల్లాల నుంచి..

తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్లో ఆదివారం సాక్షి స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్ష నిర్వహించారు. ఇదివరకు జిల్లాస్థాయిలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ (రెండవ రౌండు)లో ప్రతిభ చాటిన విద్యార్థులకు రీజనల్ స్థాయిలో సెమీఫైనల్ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన 1 నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు కేటగిరీల్లో ఈ పరీక్షను లైవ్ ద్వారా నిర్వహించారు. ఇందులో సత్తా చాటిన విద్యార్థులు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.

SAKSHI | సాక్షి | సాక్షి SAKSHI TV | SAKSHI DIGITAL | MEDIA GROUP

విద్యార్థులకు సరైన వేదిక స్పెల్‌బీ..

ఆధునిక యుగంలో విద్యార్థులు రాణించాలంటే ఆంగ్లం తప్పనిసరంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అన్నారు. ఈ ఆవశ్యకతను గుర్తించిన సాక్షి యాజమాన్యం ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంగ్ల భాషపై ప్రావీణ్యం సాధించేందుకు సరైన వేదిక సాక్షి స్పెల్‌బీ అన్నారు. ఉన్నత చదువుకు, ఆహ్లాదకరమైన పోటీతత్వం పెంపొందడానికి ఏటా సాక్షి మీడియా గ్రూప్ నిర్వహిస్తున్న స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ వంటి పరీక్షల్లో తమ పిల్లలను ప్రోత్సహిస్తే వారు ఉన్నతంగా రాణించేందుకు చక్కని అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

SAKSHI SPELL Bee

ఆత్మవిశ్వాసం రెట్టింపు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లిష్ భాష తప్పనిసరి. సామాజిక బాధ్యతతో పాటు విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. స్పెల్‌బీ ద్వారా విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం సాధించగలుగుతారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపై చదువులో ఉన్నతంగా రాణించగలుగుతారు.

– ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం హైస్కూల్, తిరుపతి

ఇంగ్లిష్‌పై ఆసక్తి..



గత ఏడాది స్పెల్‌బీ పరీక్షలో రెండో రౌండు వరకు వచ్చా. దీంతో ఇంగ్లిష్‌పై మరింత ఆసక్తి పెంచుకుని బాగా సిద్ధమయ్యా. ఈ ఏడాది సెమీ ఫైనల్‌కు చేరుకున్నా. స్పెల్‌బీ పరీక్ష ద్వారా కొత్తకొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. వాటితో పాటు ఆ పదాలను ఎలా ఉచ్చరించాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ సెమీఫైనల్ పరీక్షను బాగా రాశాను. ఫైనల్‌కు చేరుకుంటాననే నమ్మకం ఉంది.

– బి.సాయిసాన్వి, 4వ తరగతి, నాగార్జున మోడల్ స్కూల్, కడప

మొదటి మారు పాల్గొన్నా..



స్పెల్‌బీ పరీక్షకు మొదటిసారి ఈ ఏడాది పాల్గొంటున్నా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని ఇంగ్లిష్ పదాలను బాగా సాధన చేశాను. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరచి సెమీ ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా నాలో ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెరిగింది. కొత్తకొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగాను. థ్యాంక్స్ టు సాక్షి.

– వై.శామ్యూల్ నోయెల్, 7వ తరగతి, ఓవెల్ మోడ్రన్ స్కూల్, కడప

ఫస్ట్ ప్రైజే లక్ష్యం



నాకు ఇంగ్లిష్ అంటే చాలా ఇష్టం. అందుకే సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీలో ఆరోసారి పాల్గొన్నాను. రెండేళ్ల క్రితం ఫైనల్‌కు చేరుకున్నా. గత ఏడాది ఫైనల్‌లో మూడో స్థానం సాధించాను. ఈ ఏడాది ఫైనల్‌లో ఫస్ట్ ప్రైజ్ సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. అందుకు తగ్గట్టుగా బాగా ప్రిపేర్ అయ్యాను.

– కె.జ్యోతిష, 10వ తరగతి, సంసిద్ కేంఫోర్డ్(ఈస్ట్) స్కూల్, చిత్తూరు

సామర్థ్యం పెరిగింది



స్పెల్‌బీలో పాల్గొనడం ఇది మూడో మారు. ఇంగ్లిష్ భాషలో నాకు సామర్థ్యం పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. ఇంగ్లిష్‌లో సరళంగా, తప్పులు లేకుండా మాట్లేడేందుకు స్పెల్‌బీ దోహదపడి నాలో ఆత్మవిశ్వాన్ని పెంచింది.

– గౌరవ్‌కుమార్ రాయ్, 9వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి

ఫైనల్‌కు వెళ్లడమే లక్ష్యం



గత ఏడాది స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరుకున్నాను. ఈ ఏడాది సెమీ ఫైనల్స్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ మెటీరియల్‌లోని అన్ని పదాలను బాగా సాధన చేశాను. కొత్త పదాల స్పెల్లింగ్, ఉచ్చారణ మా టీచర్‌ను అడిగి తెలుసుకున్నాను. ఈ ఏడాది సెమీఫైనల్‌లో రాణించి ఫైనల్‌కు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రిపేర్ అయ్యాను.

– సీహెచ్ షక్రుత్, 7వ తరగతి, సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్, నెల్లూరు

పోటీ పరీక్షలకు ఉపయోగం



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించవచ్చు. స్పెల్‌బీ మెటీరియల్‌లోని పదాలు చాలా వరకు కొత్తవి. ఆ పదాలను ఎలా పలకాలి, వాటి స్పెల్లింగ్, అర్థం తెలుసుకున్నాను. 2022లో సెమీ ఫైనల్ వరకు చేరుకున్నాను. తిరిగి ఈ ఏడాది సెమీఫైనల్‌కు వచ్చాను. ఈ స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్ నాలెడ్జ్ పెరిగింది.

– జె.సాయిచేతన్, 7వ తరగతి, రెయిన్‌బో స్కూల్, నెల్లూరు

కొత్త పదాలు నేర్చుకుందాం



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షను మొదటిసారి రాస్తున్నా. మొదటి రెండు రౌండ్లో నెగ్గి ఇప్పుడు సెమీ ఫైనల్ దాకా వచ్చా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని ఇంగ్లిష్ పదాలు చాలావరకు కొత్తవి. ఆ పదాలను ఎలా ఉచ్చరించాలి? వాటి స్పెల్లింగ్స్, అర్థాలను మా టీచర్‌ను అడిగి తెలుసుకున్నాను. స్పెల్‌బీకి ప్రాక్టీస్ చేసే కొద్దీ నాలో ఇంగ్లిష్‌పై ఆసక్తి రెట్టింపైంది. థ్యాంక్స్ టు సాక్షి.

– డి.పోసిన్యాశ్రీ, 5వ తరగతి, లిటిల్ ఏంజెల్స్ స్కూల్, తిరుపతి


ఉపాధ్యాయులే మూలస్తంభాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారత దేశంలో సామాజిక అభివృద్ధికి ఉపాధ్యాయులే మూల స్తంభాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం యూటీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జీజే రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థ చిన్నాభిన్నమయ్యే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు క్రమంగా తగ్గుతూ వస్తోందన్నారు. అనేక స్కూళ్లు మూతపడ్డాయని, చాలాచోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఓ పక్క శాస్త్ర సాంకేతిక నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా విద్యా విధానాన్ని కొనసాగిస్తామని చెబుతున్న ప్రభుత్వాలు, ప్రాథమిక స్థాయిలో పాఠశాలలు కనమరుగయ్యే అనేక రకాల కార్యక్రమాలను విద్యావ్యవస్థలో ప్రవేశపెడుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి తరుణంలో సామాజిక స్పృహ కలిగిన యూటీఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండ కట్టాలని, వాటి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యం సాధించడానికి విద్యావ్యవస్థలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి వెన్నుదన్నుగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వ చొరవచూపాలన్నారు. అంతకుముందు బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు పెద్ద ఎత్తున్న యూటీఎఫ్ నాయకులు స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు.

కలంకారీ.. మనసు దోచెనే..


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన కొందరు అమెరికన్లకు కలంకారీ వస్త్రాలు నచ్చాయి. ఆదివారం ఆలయానికి విచ్చేసిన కొందరు విదేశీయులు శ్రీకాళహస్తి ప్రఖ్యాత కళ అయిన కలంకారీ దుస్తులు కొనడానికి బానోదయ కలంకారీ సంస్థకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు కలంకారీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనేక వస్త్రాలను కొనుగోలు చేశారు. ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి ఆర్ట్ లేదని వారు కొనియాడారు.

గణితం టాలెంట్ టెస్టుకు స్పందన



తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విశ్వం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్లో శ్రీనివాస రామానుజన్ ఇండెలిబ్ మ్యాథ్‌మెటిక్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుకు విశేష స్పందన లభించింది. తిరుపతి జిల్లా నలుమూలల నుంచి 5–8వ తరగతి చదివే విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచడం, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించడమే ఈ టాలెంట్ టెస్టు లక్ష్యమని విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి తెలిపారు.

జిల్లా స్థాయిలో విద్యార్థిని జాహ్నవి ప్రతిభ



జాహ్నవికి బహుమతి ప్రదానం చేస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారి

శ్రీకాళహస్తి రూరల్: మండలం ఊరందూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.జాహ్నవి రాష్ట్ర పౌర సరఫరా శాఖ వారు నిర్వహించిన ×వినియోదారుల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు–వాటి వినియోగ్ణ అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని జాహ్నవికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజకుమారి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన తమ విద్యార్థి జాహ్నవి 24న వినియోగదారుల జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరగనున్న పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటానమస్ హోదాలో తొలి అడుగు

- నేటి నుంచి టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు
- అటానమస్ హోదాలో తొలిసారి పరీక్షలు రాయనున్న 3 వేల మంది విద్యార్థులు
- ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్, ఎస్పీడబ్ల్యూ కళాశాలల్లో ఏర్పాట్లు
- పరీక్షలు సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం చేసిన కళాశాలల సిబ్బంది



పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల

తిరుపతి సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాలో తొలి అడుగు వేయనున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో అటానమస్ హోదా సాధించిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలు తొలిసారి ప్రత్యేక హోదాలో తొలి పరీక్షకు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు బీఏ, బీకాం, బీఎస్సీ చదువుతున్న ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తొలి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు టీటీడీ విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తొలి పరీక్షకు 3వేల మంది విద్యార్థులు

స్వయం ప్రతిపత్తి హోదా సాధించిన టీటీడీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభం కానున్న డిగ్రీ తొలి ఏడాది తొలి సెమిస్టర్ పరీక్షకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందుకోసం టీటీడీ జేఈఓ, డీఈఓ ఆదేశాల మేరకు ఆయా కళాశాల ప్రిన్సిపల్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ నియమించారు. ప్రశ్నపత్రాల తయారీలో కూడా పటిష్టమైన నిబంధనలను పాటిస్తూ ఎగ్జామినేషన్ ప్యానల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రక్రియ పూర్తి చేశారు. ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాలకు సంబంధించిన ప్రశ్నపత్నాల్లో ఎటువంటి తప్పిదాలు దొర్లకుండా ఒక్కో కళాశాలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఎటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సర్వం సిద్ధం



అటానమస్ హోదాలో తొలి అడుగు వేస్తున్నాం. ఫస్ట్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సాఫీగా సాగేందుకు సర్వం సిద్ధం చేశాం. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలోని బీఏ, బీఎస్సీ, బీకాం చదువుతున్న సుమారు 749 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 19 ప్రోగ్రాంల నుంచి తొలి పరీక్షకు హాజరు కానున్నారు. ఇందుకోసం 40మంది ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ కోసం ఆరుగురు అధికారులను నియమించాం. ఇప్పటికే హాల్‌టికెట్లు అందజేశాం. ఐడీ కార్డులు, హాల్‌టికెట్లతో పరీక్షా సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని విద్యార్థులకు సమాచారం ఇచ్చాం.

– డాక్టర్ బి.సత్యనారాయణ, ప్రిన్సిపల్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల

అన్ని ఏర్పాట్లు పూర్తి..



ఎంతో ఘన చరిత్ర ఉన్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాలను ఈ ఏడాది నుంచి అటానమస్ హోదాలో పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నాం. డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సుమారు 20 ప్రోగ్రాంల నుంచి 1020 మంది విద్యార్థులు ఫస్ట్ సెమిస్టర్ రాయనున్నారు.

– డాక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

పరీక్షలకు సర్వ సిద్ధం



పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అటానమస్ పొందిన తర్వాత తొలిసారిగా పరీక్షలకు వెళ్తున్నాం. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎస్పీడబ్ల్యూ కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలోని 22 ప్రోగ్రాంలకు సంబంధించి సుమారు 1084మంది విద్యార్థినులు ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష రాయనున్నారు. ఈనెల 31 వరకు జరగనున్న పరీక్షల కోసం ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ టీమ్‌లను ఇప్పటికే నియమించాం.

– డాక్టర్ భద్రమణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, ఎస్పీడబ్ల్యూ కళాశాల

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్మగ్లర్ల ఆట కట్టిస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా స్మగ్లర్‌గా 8 కేసుల్లో నిందితుడైన వైఎస్సార్ కడప జిల్లా, చాపాడు మండలం ఖాదర్‌వల్లి గ్రామానికి చెందిన ఫక్రువల్లి కుమారుడు షేక్ చంపతి జాకీర్ (30)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కడప జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఈరోజు నిందితుడిపై పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ స్మగ్లర్ విలువైన ఎర్రచందనాన్ని కొల్లగొడుతూ అటవీ, వన్యమృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలకు పాల్పడుతుండడంతో ఇతనిపై పీడీ యాక్ట్ ఉత్తర్వులు అమలు చేస్తూ కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనకాడమని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. అటవీ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, అరుదైన వృక్ష సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.